

# వంటమనిషి కుదిరింది!

- మంత్రవాది మహేశ్వర్

**చలపతికి** ఉద్యోగం దొరికింది. అయితే విశాఖ పట్నంలో పోస్టింగిచ్చారు. పుట్టినప్పట్నుంచీ హైదరాబాదుకు బంకలా అతుక్కుపోయి ఉండడంతో చాలావిలవిల్లాడిపోయాడు. అయినా, తప్పదు. ఉద్యోగమే దొరక్క జనం గోల పెట్టేస్తుంటే పూంాదకాలంటేనే బాధపడితే ఎలా? అయినా, అందరికీ ఉన్నచోటే రావాలంటేఎలా? ఎక్కడుంటే అదే తన వూరు. అయినా, హైదరాబాదుకి విశాఖకి ఎంతదూరం! సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కితే ఉదయానికి హైదరాబాద్‌లో ఉండొచ్చు ( ఏ ఏక్సిడెంట్ జ రక్కపోతే ). ఆ మాటే చలపతికి నాంపల్లి స్టేషన్‌లో సెండాఫ్ ఇవ్వడాని కొచ్చిన అమ్మా, నాన్నా చెప్పారు.

"విశాఖపట్నమా! అయ్య బాబోయ్. ఎలాగుంటా వురా, బంగారు కొండా! నీ కొచ్చే తొమ్మిదొందలు అక్కడి ఖర్చులకే చాలవే?"

"వెళ్ళగానే ఎక్కడ దిగుతావు ( సముద్రంలోనా అన్నట్లు ). అఫ్‌కోర్స్ బంధువు లున్నా రనుకో. నీ కాంప్లెక్స్‌ని బట్టి చూస్తే అక్కడ దిగేలా కని పించటం లేదు. మరి రూమ్ అక్కడ అంత ఈజీగా దొరుకుతుందనే?!"

"సముద్రపుగాలి చాలా మందికి పడదు, గురూ! ఏనుగులాంటి వాళ్ళు కూడా పీనుగులైనట్లుగా దాఖలా లున్నాయి. ఎందుకు—మా మావయ్య ఎంత పర్సనాలిటీ ఉండేవాడో తెలుసుగా! అంతా ఎయిర్ ఫోర్స్‌లోకి వెళ్ళమని పీక్కుతినేశాం. ఏమైంది. జస్ట్ వో ఆర్నెల్లు వైజాగ్‌లో హోటల్ భోజనం చేశాడంతే. గుర్తుపట్టలేనంతగా చిక్కి శల్యమై పోయాడు."

"హైదరాబాద్‌లో ఉండే చార్మ్, మజా ఎక్కడుంటుంది చెప్పు. అలా అబిడ్స్ నుంచి కోటీ వైపుకు, క్రాస్ రోడ్స్ నుంచి చిక్కడపల్లికి వెడితే చాలు. బోలెడంత కలరు. అక్కడో ..."

"హిందీ, ఇంగ్లీషు పిక్చర్లు వైజాగ్‌లో చాలా తక్కువగా వస్తుంటాయి. ఇక పాపం తెలుగే గతి మన చలపతికి."

"సంవత్సరమో, రెండేళ్ళో ఉండాల్సి ఉంటుంది అని ఖచ్చితంగా తెలిస్తే ఏవో తిప్పలు పడొచ్చు. అక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ కావడం అంతసులభమా? వైజాగ్‌కి చెందిన వాడే అయినా, హైదరాబాదొచ్చాడంటే చస్తే మళ్ళీ తిరిగి వెళ్ళడానికి ఇష్టపడడు. ఇక మనవాడిని రికమండ్ చేయడానికి ఎవరూ లేడాయె."

—అలా రకరకాలుగా వర్ణించింది మిత్ర బృందం.

వాళ్ళు అలా వర్ణించేటప్పుడు తను ప్రస్తుతం చేసే, మూడొందలిచ్చే ప్రైవేటు కంపెనీ ఉద్యోగంలోనే ఉండిపోవాలనిపించింది చలపతికి. అయితే భవిష్యత్తో ...? ఈ రోజున ఇరవై నాలుగేళ్ళా, రేపు పాతిక, ఈ రోజున ఒంటరైన్న భవిష్యత్తులో పెళ్ళి, పెళ్ళాం ... పిల్లలు, చదువులు, సమస్యలు. తొమ్మిదొందలిచ్చే గవర్నమెంటు ఉద్యోగం వదిలేసి, దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ్డ ఉద్యోగాన్ని నమ్ముకుంటే ఎలా? అయినా వైజాగ్‌లో ఉండే వాళ్ళంతా ఏం చేస్తున్నారు. అంతకంటే తక్కువ జీతం వచ్చే వాళ్ళు అంతలోనే సర్దుకోవడంలేదూ— ఫ్రెండ్స్ అభిప్రాయా లన్నింటినీ తన బలమైన నిర్ణయంలో గట్టిగా కొట్టిపారేశాడు, వెనుకడుగు వేయించే ఆలోచన రాకుండా.

• • • •

"బ్రహ్మచారికి ఇల్లు ఇవ్వం" అని గొంతు చించేసుకున్న వాళ్ళు కూడా చలపతి మాట తీరు, ప్రవర్తనలకి తబ్బిబ్బయి గది ఇవ్వడానికి ఇష్టపడ్డారు వో రెండుమూడు చోట్ల.

యూనివర్శిటీ ఏరియాలో ఉంటే ఆఫీసుకు దగ్గరవుతుందని ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రిఫర్ చేశాడు.

ఇంటాయనకి తన బయోడేటా అంతా టైప్ చేసి ఇవ్వకపోయినా, పూస గుచ్చినట్లు చెప్పేశాడు. ఆయన ఇష్టాల్నీ, పరదాల్నీ తనవిగా భావించేసుకుని 'వూ' కొట్టేస్తూ, సమర్థించేశాడు. తరవాత గేటు తాళం గురించి, పంపునీళ్ళ గురించి, కరెంటుగురించి ముందే చర్చించేసి డెబ్బయి అయిదుకి ఇంటాయన గది అని చెప్పి చూపించిన దాంట్లో ఇరుక్కుపోయాడు.

'ఆఫీసులో ఉన్నంతవరకూ పనితోపడి ఒంటరితనం మరిచిపోగలిగినా, డ్యూటీ అయిపోగానే మహా పిచ్చిగా ఉండేది. ఏమీ తోచేది కాదు. అలా జగదాంబ దాకా వెళ్ళడమో, లేదంటే రామకృష్ణా బీచికి వెళ్ళి కాసేపు సముద్రాన్ని చూస్తూ కూర్చోవడమో చేసేవాడు.

ఆఫీసులో కొలీగ్స్‌తో అంత సన్నిహితంగా ఉండకపోవడానికి కారణాలూ ఉన్నాయి. వాళ్ళ త్రాగుడు, పేకాట వగైరా వగైరాలు తనకి పడవు కనుక.

"నీకేం ఏక్ నిరంజన్. వో రెండొందల్లో సర్దుకుని మిగిలినదంతా బాంకులో దాయొచ్చు" అన్న వాళ్ళు, అలా అనుకుని తరచు అప్పు అడిగినవాళ్ళూ ఉన్నారు. ఇచ్చిన డబ్బు తిరిగిచ్చేట్లనిపిస్తే ఇచ్చేవాడు చలపతి, అప్పుడప్పుడూ కొందరికి.

వైజాగ్ వచ్చిన సంవత్సర కాలంలో చలపతికి ఇద్దరుమాత్రం మంచి ఫ్రెండ్సయ్యారు. అందులో ఒకడు నారాయణరావు. ఖాళీగా ఉన్నప్పుడు వాళ్ళతో కబుర్లాడి ఒంటరితనాన్ని కొంతవరకూ మరచిపోగలిగేవాడు.

ట్రాన్స్‌ఫర్ రిప్రజెంటేషన్ ఇచ్చాడు కానీ, ప్రయోజనం కనిపించలేదు.

ఆఫీసర్లందరి అభిమానం పొందడానికి ఎక్కువ రోజులు కూడా పట్టలేదు.

చలపతి ఆఫీసు పని విషయంలో చాలా సిన్సియర్ కావడమేనేమో — రిప్రజెంటేషన్ పరిశీలించకపోవడానికి గల కారణం.

వారం వారం ఇంటికి ఉత్తరం రాసేవాడు.


ఆరేసి నెల్లకి వో సారి వో వారం శలవు పెట్టి హైదరాబాద్ వెడుతుండేవాడు.


రెండో ఇంక్రిమెంట్ కూడా అందుకున్నాడు.

హైదరాబాద్‌లో తన మిత్రబృందంలో కూడా వో ఇద్దరు ముగ్గరికి ఉద్యోగాలొచ్చాయి — ఒకరికి కాలికట్‌లోను, మరొకరికి అహమదాబాదులోనూ! తనకి అంత ఉపదేశం చేసిన వాళ్ళు కూడా నోరెత్తకుండా వెళ్ళి చేరిపోయారు. వాళ్ళ మాటలకు భయపడిపోయి వైజాగ్ పోస్టింగ్ వదిలేసుకుని ఉంటే ఏమయ్యేది? అందుకే కొన్ని నిర్ణయాలు ఎవరికి వాళ్ళే తీసుకోవాలి. నిజానికి ఇప్పుడు స్నేహితుల కంటే కూడా హైదరాబాదుకి తనే దగ్గర్లో ఉన్నాడు.

• • • •

చలపతి పనిచేస్తున్న ఆఫీసు కొచ్చిన ఒకళ్ళిద్దరు



— ఎస్. సుందర్ బాబు —

8—9—82

అతని పెళ్ళి విషయం కదిపారు. తన కిప్పట్లో ఏ ఉద్దేశం లేదని చెప్పి ఏదోలా పంపించేశాడు.

"పెళ్ళిచేసుకునే వయస్సు, లక్షణమైన ఉద్యోగం ఉద్దేశం లేదు అంటా వేమిటి" అన్నవాళ్ళూ ఉన్నారు.

"కుటుంబ పరిస్థితులు" అన్నాడు.

"అవి అందరికీ ఉండేవే, వాటితో పెళ్ళి ముడెడితే ముసలాడి వైపోతావు" అన్న జవాబులూ విన్నాడు.

అయితే ఆఫీసులో అన్నవాళ్ళ మాటలు పట్టించుకోలేదు. తను క్లోజు అనుకునే ఫ్రెండ్స్ కూడా పెళ్ళి చేసుకోమనే సలహా ఇచ్చారు.

"నువ్వు ఈ వయసులో పెళ్ళి చేసుకుంటేనే, నువ్వు రిటైరయ్యే టైముకి నీ పిల్లలు నీ కందొస్తారు" అని లెక్కలేసి, ఉదాహరణలిచ్చి మరీ చెప్పాడు ఒక ఫ్రెండు.

దాంతో ఆలోచనల్లో పడ్డాడు. సిద్ధమే తను...

అయితే, ఆ విషయం ఇంటికి ఎలా రాయడం?

ఒకవేళ వాళ్ళకే కనుక ఉద్దేశముంటే తను ఇన్నిసార్లు హైదరాబాదు వెడుతున్నాడు — ఆ ప్రసక్తి ఎత్తేవారు కదా!

అంటే ఇంట్లోవారికి ఇప్పట్లో ఆ ఆలోచన లేదేమో.

తనకి తన తల్లితండ్రులంటే ఎంతో ప్రేమ, అభిమానం. వాళ్ళ మనసుకు నొప్పి కలిగించేవిధంగా ప్రవర్తించడు. ప్రవర్తించలేడు.

పెద్దగా చదువుకోకపోయినా, మంచి సంస్కారమున్న పిల్లని చేసుకోవాలనే అనిపిస్తోంది ఇప్పుడు చలపతికి.

కట్నం విషయమైతే తను పూర్తిగా వ్యతిరేకిస్తాడు. తన మాటకు అమ్మా నాన్నా తప్పకుండా విలువనిస్తారు కాబట్టి ఏ గొడవా లేదు.

ప్రేమ వివాహం అయితే వేరు. లేనిపక్షంలో మంచి చెడ్డలు పెద్దవాళ్ళు నిర్ణయిస్తేనే బావుంటుంది అన్న అభిప్రాయం చలపతిది. అలాగని సొంత నిర్ణయాలు మంచివి కాదు అని వాదించడు.

కొత్తగా తన బుర్రలో దూరిన పెళ్ళి ఆలోచనను ఎలా వ్యక్తం చేయాలి?

డైరక్టుగా రాయాలంటే అదోలా ఉంది తనకి.

అదే సమస్య!

● ● ●

ఉత్తరాల్లో పరోక్షంగా పెళ్ళిమీద తన ఇష్టాన్ని వ్యక్తం చేశాడు.

తన స్నేహితుల పెళ్ళి సంబంధాల విషయాలు అవీ ఇవీ ఉత్తరాల్లో వ్రాసేవాడు.

హోటల్లో భోజనం ఏం బావుండడంలేదని పాత విషయమే కొత్తగా వ్రాశాడు.

భోజనం రేట్లు బాగా పెరిగిపోయాయని, తనకి హోటళ్ళకయ్యే ఖర్చులో నలుగురు బ్రతకచ్చు అని కూడా వ్రాశాడు.

కానీ, ఏం ఉపయోగం లేదు. త నాశించినట్లుగా లేవు జవాబులు.

పైగా తనకోసం ఆఫీసుకొచ్చిన ఒక వ్యక్తి ద్వారా మరో విషయం పిడుగులా పడింది.

ఆ వచ్చిన వ్యక్తి హైదరాబాద్‌లో చలపతి తల్లి దండ్రుల్ని కలిసి అతగాడి పెళ్ళి విషయం మాట్లాడట. "ఇప్పుడే నా ముఖం వాడికి పెళ్ళి ఏమిటండీ. మొన్ననేగా ఉద్యోగమొస్తే. పెద్ద ఎన్నేళ్ళున్నాయని? మొన్ననేగా పాతిక వెడతా. అయినా ఈ రోజుల్లో ఆడపిల్లలకే ఆ వయసు దాటాక గానీ పెళ్ళిళ్ళు చేయడం లేదు. మగ పిల్లాడికి అదేం పెద్ద వయస్సని" అన్నారట.

ఆ మాటలు చలపతి చెవిని పడగానే మూడ్ అవుటయిపోయింది.

ఈ సమయంలో తన ఉత్తరానికి వాళ్ళిచ్చే జవాబు ?

ఆదివారం బీచ్‌కి వెళ్ళినా అదోలా ఉంటూంది.

సినిమాకి వెళ్ళినా ఏదోలా అనిపిస్తోంది.

ఆఫీసునుంచి ఇంటికి వెంటనే వెళ్ళి చేసేది ఏమిటి? తనకోసం ఎవరున్నారని? ఇలా పరిపరి విధాలా ఆలోచనల్లో పడిపోయాడు.

● ● ● ●

ఇంటి కో ఉత్తరం రాశాడు నాలుగు రోజులు ఆలోచించుకున్నాక.

"అమ్మా!

అంతా కులాసాయే అనుకుంటాను.

భోజనం ఇబ్బందిగా ఉంటోందని ఇదివరలో రాశాను. ఇప్పుడు బాధ లేదు. ఎందుకంటే వంటమనిషిని కుదుర్చుకున్నాను. పదహారేళ్ళ పిల్ల — అనుభవం ఉందో, లేదో వంట చేయగలుగుతుందా అనిపించింది కుదుర్చుకునేటప్పుడు. కానీ, చాలా చక్కగా, రుచిగా, శుచిగా చేస్తోంది. వచ్చేసారి హైదరాబాద్ నేను వచ్చినప్పుడు నువ్వు గుర్తుపట్టలేనంత లావెక్కిపోవచ్చు. అదీ కాకుండా ఆ పిల్లకి వాళ్ళ వాళ్ళు ఎవ్వరూ లేరు. అందుకనే ఎక్కువసేపు ఇక్కడే ఉంటుంది కబుర్లు చెబుతూ. వంట చేసినట్టే, ఆ అమ్మాయి తిన్నా ఖర్చు ఇదివరకటికంటే తక్కువే అవుతోంది. స్నానానికి నీళ్ళు పెట్టడం దగ్గర్నుంచీ అన్ని పనులూ చేస్తోంది. కనుక సుఖంగా ఉంది. ఇదివరలో అయితే హోటల్ మీల్స్ ఎన్నాళ్ళు చేస్తావు, పెళ్ళి చేసుకో — సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు ఫ్రెండ్స్. ఆ విషయమూ నీకు లోగడ రాశాను. కాని, ఆ అవసరం లేదు నడిచిపోతుందిగా అని చెప్పాను.

ఇంకా ఏమిటి విశేషాలు. వచ్చేనెల నుంచీ నాకు మరో డి. ఎ. కలుస్తుంది. నేను పంపిన డ్రాఫ్టు అందిందనుకుంటా.

జవాబు వ్రాయి.

ఇట్లు,

చలపతి."

సాధారణంగా వారం పది రోజులదాకా గానీ రాని జవాబు మూడ్రోజులకే వచ్చేసింది ఇంటినుంచి.

"చలపతికి!

నీ తల్లి దీవించి వ్రాయునది—

నువ్వు రాసిన ఉత్తరం అందింది. అంతకు ముందు పంపిన డ్రాఫ్టు అందింది.

ఇక్కడ అడ్వొకేటు సదాశివంగారు నీకు తెలుసనుకుంటా. వారి రెండో అమ్మాయిని చూశాం, మాకు బాగా నచ్చింది. బుద్ధిమంతురాలు. తెలివైన పిల్ల. నువ్వు కూడా ఒకసారి వస్తే చూడొచ్చు. నచ్చితే వెంటనే ముహూర్తం పెట్టుకోవచ్చు. వెంటనే బయలుదేరి రా.

జానకి."

చూసి నవ్వుకున్నాడు.

వెంటనే హుషారుగా చెప్పులేసుకుని బయలుదేరాడు — వంటమనిషి కుదిరిందని అబద్ధం ఆడించి ఉత్తరం వ్రాయించిన ఫ్రెండ్ నారాయణని కంగ్రాట్ చేద్దామని. ●